క్లుప్తంగా

వైఎస్సార్‌ సీపీ కార్యాలయంలో నేడు జగ్జీవన్‌రామ్‌ జయంతి

ఒంగోలు సిటీ: స్థానిక వైఎస్సార్‌ సీపీ జిల్లా కార్యాలయంలో శనివారం డాక్టర్‌ బాబూ జగ్జీవన్‌రామ్‌ జయంతి వేడుకలు నిర్వహించనున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉదయం 10.30 గంటల నుంచి వేడుకలు నిర్వహించనున్నట్లు పార్టీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డితో పాటు జెడ్పీ చైర్‌పర్సన్‌ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ చుండూరు రవిబాబు పాల్గొంటారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మద్దిపాడు ఏఎంసీ నూతన చైర్‌పర్సన్‌గా రాజేశ్వరి

సంతనూతలపాడు: మద్దిపాడు వ్యవసాయ మార్కెట్‌ కమిటీ చైర్‌పర్సన్‌గా చీమకుర్తికి చెందిన మన్నం రాజేశ్వరి నియమితులయ్యారు. ఆ మేరకు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి.

పబ్లిక్‌ హెల్త్‌ యూనిట్‌ భవనం ప్రారంభం

చీమకుర్తి రూరల్‌: మండలంలోని బండ్లమూడి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన పబ్లిక్‌ హెల్త్‌ యూనిట్‌ బ్లాక్‌ భవనాన్ని శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే బీఎన్‌ విజయకుమార్‌ ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వరరావు, తహసీల్దార్‌ బ్రహ్మయ్య, సర్పంచ్‌ దేవరపల్లి వెంకటలక్ష్మి, హాస్పిటల్‌ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో మోహన్‌రెడ్డి

కొత్తపట్నం: ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకుని వ్యవసాయం చేస్తే ఖర్చులు తగ్గించుకోవడమే కాకుండా లాభాలు ఆర్జించవచ్చని మండల వ్యవసాయ శాఖ ఏవో మోహన్‌రెడ్డి అన్నారు. కొత్తపట్నం రైతు సేవా కేంద్రంలో శుక్రవారం భూసార పరీక్షలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షల ఆవశ్యకత, సూక్ష్మ పోషకాల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ నెలలో మట్టి నమూనాలను వీఏఏలు సేకరించి పంపాలని, వారి పొలంలో భూసార పరీక్ష చేయించుకోవాలని తెలిపారు. విత్తనం వేయకముందు భూసార పరీక్ష చేయించుకుని వాటికి కావాల్సిన ఎరువులు వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు అభినందనలు



కలెక్టర్‌ను అభినందిస్తున్న రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు

ఒంగోలు సబర్బన్‌: బంగారు బాల్యం కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించి స్కోచ్‌ అవార్డు అందుకున్నందుకు జిల్లాలోని అధికారులు శుక్రవారం కలెక్టర్‌ తమీమ్‌ అన్సారియాను కలిసి అభినందించారు. ప్రకాశం భవన్‌లోని కలెక్టర్‌ చాంబర్‌లో రెవెన్యూ, తదితర శాఖల అధికారులు, సిబ్బంది, డీటీసీ సుశీల, బ్రేక్‌ ఇన్‌స్పెక్టర్లు కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

దొనకొండ: రైతులు పండించిన మిర్చి, కంది పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్‌ సీపీ జిల్లా కార్యాచరణ కార్యదర్శి బత్తుల వెంకట సుబ్బయ్య డిమాండ్‌ చేశారు. రూ.వేలకు, వేలు ఖర్చు చేసి మిర్చి, కంది సాగు చేశారని, కూలీ రేట్లు విపరీతంగా పెరిగాయని, తీరా గుంటూరు మార్కెట్‌ యార్డులో పూర్తిగా ధర పడిపోయిందని, గత 4 సంవత్సరాల్లో మిర్చి ధర కనిష్టం రూ.18 వేలు, గరిష్టం రూ.22 వేలు పలికిందని చెప్పారు. నేడు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులను పట్టించుకునే నాథుడే కరువయ్యాడన్నారు. నేడు మిర్చి రూ.11 వేలకు కూడా అడిగే నాథుడే లేడన్నారు.

ప్రభుత్వ సొమ్ము రికవరీ చేస్తాం

తర్లుపాడు: మండలంలో ఉపాధి హామీ పథకం పనులు, కూలీల మస్టర్‌లో అవకతవకలకు పాల్పడిన సిబ్బంది నుంచి ప్రభుత్వ సొమ్ము రికవరీ చేస్తామని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్‌ జోసెఫ్‌ కుమార్‌ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకానికి సంబంధించి సోషల్‌ ఆడిట్‌ నిర్వహించారు. పలు గ్రామాల నివేదికలను పరిశీలించారు. కూలీల మస్టర్లలో పొరపాట్లు, హార్టికల్చర్‌కు సంబంధించి కొన్నిచోట్ల మొక్కలు లేకపోవడాన్ని గుర్తించినట్లు చెప్పారు. అవకతవకలకు పాల్పడిన సిబ్బంది నుంచి ప్రజా ధనాన్ని రికవరీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చక్రపాణి ప్రసాద్‌, ఎంపీపీ భూలక్ష్మి, ఏపీఓ బుల్లెన్నరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం మేరకు ధాన్యం కొనుగోళ్లు

- జిల్లాలో 10 వేల మెట్రిక్‌ టన్నుల కొనుగోళ్లు లక్ష్యం
- రబీలో 76,397 మెట్రిక్‌ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా
- 41 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరణ
- ప్రొక్యూర్‌మెంట్‌ కమిటీ అధికారులతో నిర్వహించిన సమీక్షలో జేసీ గోపాలకృష్ణ



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు సబర్బన్‌: జిల్లాలో రబీ సీజన్‌లో పండించిన ధాన్యం 10 వేల మెట్రిక్‌ టన్నులను రైతుల నుంచి సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు జాయింట్‌ కలెక్టర్‌ రోణంకి గోపాలకృష్ణ వెల్లడించారు. స్థానిక ప్రకాశం భవన్‌లోని ఆయన చాంబర్‌లో శుక్రవారం రబీ సీజన్‌ 2024–25వ సంవత్సరానికి సంబంధించి జిల్లా ప్రొక్యూర్మెంట్‌ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ 2024–25వ సంవత్సరంలో గ్రేడ్‌–ఏ రకం ధాన్యానికి మద్దతు ధర క్వింటాకు రూ.2,320, సాధారణ రకం మద్దతు ధర క్వింటా రూ.2,300 రైతులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం రబీ పంట కాలంలో రైతులు 32,425 ఎకరాలలో వరి పంట సాగు చేశారని, అందుకుగానూ 76,397 మెట్రిక్‌ టన్నుల ధాన్యం దిగుమతి వచ్చిందని అన్నారు. అందులో 10,000 మెట్రిక్‌ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్దేశించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో పండిన వరి ధాన్యాన్ని సేకరించడానికి 27 మండలాలలో 239 రైతు సేవా కేంద్రాలను అనుసంధానం చేస్తూ 41 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. గోనెసంచులు, హమాలీలు, రవాణా సౌకర్యాల ఏర్పాటుపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లాలోని వ్యవసాయ శాఖ అధికారులకు సహకార శాఖ అధికారులకు సూచించారు. జిల్లాలోని 41 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించబడిన ధాన్యం అనుసంధానం చేయబడిన 11 రైసుమిల్లులకు రవాణా చేయాలని సూచించారు. రబీ పంట కాలంలో వచ్చే ధాన్యంలో విరుగుడు, నూక శాతం ఎక్కువగా ఉండటం మూలంగా బాయిల్డ్‌ రైస్‌ మిల్లులను గుర్తించి తద్వారా వచ్చే బాయిల్డ్‌ బియ్యం, పచ్చి బియ్యంను భారత ఆహార సంస్థకు రవాణా చేయటానికి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. రానున్న వారం రోజుల్లో వాతావరణ శాఖ సూచనల మేరకు అకాల వర్షాలు కురవవచ్చని, ధాన్యం తడవకుండా టార్పాలిన్‌ పట్టలను పరిచి భద్రపరుచుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని రైతులందరూ తాము పండించిన వరి ధాన్యాన్ని బహిరంగ మార్కెట్లలో ధర ఎక్కువ ఉన్నచో అమ్ముకోవచ్చని, ఒకవేళ బహిరంగ మార్కెట్‌లో ధర కనీస మద్దతు ధర కంటే తక్కువగా ఉంటే రైతులు తాము పండించిన పంటను కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరకు విక్రయించుకోవచ్చని జేసీ సూచించారు. సమావేశంలో మార్కాపురం సబ్‌ కలెక్టర్‌, ఒంగోలు రెవెన్యూ డివిజనల్‌ అధికారి, జిల్లా పౌరసరఫరాల శాఖ సంస్థ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, సహకార సంఘాల అధికారులు, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

చుండూరు రవిబాబుకు అభినందనలు



బాపట్ల హనుమంతరావుతో చుండూరు రవిబాబు

ఒంగోలు సిటీ: నగరంలోని కొప్పోలు గ్రామంలోని ఆయుర్వేద వైద్య కేంద్రంలో చికిత్స నిమిత్తం అమెరికా నుంచి వచ్చిన ఒంగోలు మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ డాక్టర్‌ బాపట్ల హనుమంతరావును వైఎస్సార్‌ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ చుండూరు రవిబాబు, నగర అధ్యక్షుడు కటారి శంకర్‌ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ ఒంగోలు నియోజకవర్గ బాధ్యతలు స్వీకరించిన చుండూరి రవిబాబును ఈ సందర్భంగా బాపట్ల హనుమంతరావు అభినందించారు. వైఎస్సార్‌ సీపీకి తాను ఎల్లవేళలా విధేయుడినని, తన మద్దతు ఎప్పుడూ పార్టీకి ఉంటుందని హనుమంతరావు అన్నారు.

ఉత్కంఠగా ఓబీఏ ఎన్నికలు

ఒంగోలు: ఒంగోలు బార్‌ అసోసియేషన్‌ అధ్యక్ష స్థానానికి ఆరుగురు అభ్యర్థులు బరిలో నిలిచారు. శుక్రవారం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసింది. ప్రధాన కార్యదర్శి స్థానానికి ఇద్దరు నామినేషన్లు దాఖలు చేయగా వారిలో కాకర్ల ఆదిలక్ష్మి తన నామినేషన్‌ ఉపసంహరించుకున్నారు. దీంతో సలగల జగజ్జీవన్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయనతోపాటు ఒకే నామినేషన్‌ దాఖలుచేసిన వేల్పూరి గ్రేస్‌ కుమారి (సంయుక్త కార్యదర్శి), గంటా శ్రీనివాసరావు (గ్రంథాలయ కార్యదర్శి), కాటుకూరి సంపత్‌కుమార్‌ (కోశాధికారి) కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మొత్తం 8 స్థానాలకు స్పోర్ట్స్‌ అండ్‌ కల్చరల్‌ సెక్రటరీ పోస్టుకు ఎవరూ నామినేషన్‌ దాఖలు చేయలేదు. మిగిలిన వాటిలో నాలుగు పోస్టులు ఏకగ్రీవం కాగా, మూడు పోస్టులకు ఈ నెల 11వ తేదీ జిల్లా కోర్టు భవన సముదాయం ఆవరణలోని ఒంగోలు బార్‌ అసోసియేషన్‌ హాలులో ఎన్నికల ప్రక్రియ జరగనుంది.

అధ్యక్ష స్థానానికి బరిలో నిలిచిన వారు : బొడ్డు భాస్కరరావు, చావలి రమేష్‌బాబు, గోకనకొండ శ్రీనివాసరావు, నాయుడు ఈశ్వరరావు, పీఎస్‌వీ సత్యన్నారాయణరెడ్డి, వేల్పుల తిరుమల కృష్ణయాదవ్‌

ఉపాధ్యక్ష స్థానానికి బరిలో నిలిచిన వారు : చుండూరి కృష్ణమూర్తి, మోటుమరి బలరాం

లేడీ రిప్రజెంటేటివ్‌ స్థానానికి బరిలో నిలిచిన వారు : ముద్ద హెలీన దీపాలత, తోట రాగ సుధారాణి

టీడీపీ మైనార్టీ నాయకులు రాజీనామా చేయాలి



మైనంపాడులో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు



వక్ఫ్‌ బిల్లుకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ఒంగోలు వన్‌టౌన్‌: కూటమి ప్రభుత్వం ముస్లింల గొంతు కోసిందని సోషల్‌ డెమోక్రటిక్‌ పార్టీ ఆఫ్‌ ఇండియా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అబ్దుల్‌ సత్తార్‌ విమర్శించారు. వక్ఫ్‌ సవరణ బిల్లును ఆమోదించడాన్ని వ్యతిరేకిస్తూ ఒంగోలులోని గుంటూరు రోడ్డులో ముస్లిం నాయకులు శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్‌ సత్తార్‌ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ ముఖ్యమంత్రి చంద్రబాబు, బీహార్‌ ముఖ్యమంత్రి నితీష్‌ కుమార్‌ సహకారంతోనే బిల్లు ఆమోదం పొందిందన్నారు. కూటమి ప్రభుత్వం మీద ముస్లింలు ఉమ్మివేసే పరిస్థితి ఉందన్నారు. సవరణల పేరుతో మైనార్టీ ఆస్తులను అదానీ, అంబానీలకు కట్టబెట్టాలని చూస్తున్నారన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏ పార్టీకీ ఓటు వేసేది లేదన్నారు. చంద్రబాబు కేంద్రం వద్ద ఆంధ్రుల ఆత్మాభిమానాన్ని తాకట్టు పెట్టారన్నారు. నాడు ముఖ్యమంత్రి పదవి కోసం ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచినట్లు ప్రస్తుతం ముస్లింలకు వెన్నుపోటు పొడిచారన్నారు. దీనిపై సుప్రీంకోర్టులో న్యాయ పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో పఠాన్‌ ఖాజావలీ, ఆరిఫ్‌, షఫీగని, ఇమామ్‌నురుల్లా తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌ బిల్లుకు టీడీపీ, జనసేన మద్దతు సిగ్గుచేటు

ఒంగోలు టౌన్‌: లౌకిక పార్టీగా చెప్పుకునే టీడీపీతో పాటుగా జనసేన పార్టీ వక్ఫ్‌ సవరణ చట్టానికి మద్దతివ్వడం సిగ్గుచేటని, వక్ఫ్‌ ఆస్తుల పరిరక్షణకు చట్టాన్ని కాపాడుకునేందుకు ముస్లింలంతా ఐక్యం కావాలని సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యుడు చీకటి శ్రీనివాసరావు, సీనియర్‌ నాయకుడు ఎండీ యాసిన్‌ పిలుపునిచ్చారు. వక్ఫ్‌ సవరణ చట్టానికి వ్యతిరేకంగా శుక్రవారం నగరంలోని ఇస్లాంపేట, గాంధీనగర్‌ ప్రాంతాలలో కరపత్రాల ద్వారా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మతోన్మాద అజెండా అమలులో భాగంగా బీజేపీ ప్రభుత్వం ముస్లింలపై దాడులకు పాల్పడుతోందని ఆరోపించారు. లవ్‌ జిహాద్‌, కామన్‌ సివిల్‌ కోడ్‌ వంటి చట్టాలు అమలు చేస్తూ సమాజంలో విద్వేషాలు రాజేస్తోందని విమర్శించారు. మసీదుల విధ్వంసాలు, మూక హత్యలతో మతోన్మాద శక్తులు అరాచకం సృష్టిస్తున్నాయన్నారు. ఇప్పుడు కొత్తగా వక్ఫ్‌ సవరణ చట్టం ద్వారా ముస్లింల ధార్మిక, సామాజిక, సాంస్కృతిక సంస్థలపై దాడులకు పాల్పడుతోందని చెప్పారు. వక్ఫ్‌ చట్టం పేరుతో మైనారిటీల హక్కులను కాలరాసేందుకు, ఆస్తులను కాజేసేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. ముస్లింల హక్కుల పరిరక్షణ కోసం జరిగే పోరాటాలకు సీపీఎం మద్దతు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు టి.మహేష్‌, జిలానీబాషా, ఎస్‌కే పీర్‌, జబ్బార్‌ తదితరులు పాల్గొన్నారు.

మైనంపాడు గ్రామంలో...

సంతనూతలపాడు: మండలంలోని మైనంపాడు గ్రామంలో వక్ఫ్‌ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బంకా సుబ్బారావు పాల్గొని మాట్లాడారు. ముస్లిం మైనార్టీల ఆస్తులను కార్పొరేట్లకు దోచిపెట్టడానికే సవరణ బిల్లు తెచ్చారని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం సవరణ బిల్లును వెనక్కి తీసుకుని మతసామరస్యాన్ని కాపాడాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి, నాయకులు కరిచేటి హనుమంతరావు, గుండవరపు వెంకట సుబ్బారావు, షేక్‌ కమాల్‌, షేక్‌ నాయబ్‌, షేక్‌ కరిముల్లా, షేక్‌ బికారి సాహెబ్‌, షేక్‌ కాలేషా, షేక్‌ ఖాజావలి, షేక్‌ మదర్‌ సాహెబ్‌, షేక్‌ లతీఫ్‌, షేక్‌ కాలేషా తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ కేంద్రాన్ని పరిశీలించిన డీఆర్‌డీఏ పీడీ



శిక్షణ కేంద్రంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నారాయణ

సంతనూతలపాడు: సంతనూతలపాడు మండలం ఎండ్లూరుడొంక వద్ద గల మహిళా ప్రాంగణంలో బ్యూటీషియన్‌ కోర్సు, డొమెస్టిక్‌ ఐటీ హెల్ప్‌ డెస్క్‌ అటెండెన్స్‌ కోర్సుల్లో శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌ టీ నారాయణ పరిశీలించారు. శిక్షణ పొందుతున్న మహిళలకు పలు సలహాలు, సూచనలు చేశారు. ప్రభుత్వం తరఫున ప్రతి స్కీము శిక్షణ పొందుతున్న మహిళలకు అందేలా చర్యలు తీసుకుంటామని పీడీ తెలిపారు. రుణ సదుపాయం కూడా కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా స్కిల్‌ డెవలప్మెంట్‌ ఆఫీసర్‌ జె.రవితేజ యాదవ్‌, స్టెప్‌ ఆఫీస్‌ మేనేజర్‌ శ్రీమన్నారాయణ, మహిళా ప్రాంగణ జిల్లా మేనేజర్‌ వై.అంజమ్మ, అకౌంటెంట్‌ శాంతి కుమారి, ట్రైనర్‌ కల్పన, స్కిల్‌ హబ్‌ కో ఆర్డినేటర్‌ షేక్‌ బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సమతా దివస్‌ వేడుకలు



జగ్జీవన్‌రామ్‌ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏకేయూ ప్రిన్సిపాల్‌, వైస్‌ ప్రిన్సిపాల్‌, తదితరులు

ఒంగోలు సిటీ: అణగారిన వర్గాలకు సమానత్వం కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడు, భారత మాజీ ఉప ప్రధానమంత్రి దివంగత బాబూ జగ్జీవన్‌రామ్‌ జయంతి కార్యక్రమాన్ని పురస్కరించుకుని స్థానిక ఆంధ్రకేసరి యూనివర్సిటీలో శుక్రవారం సమతా దివస్‌ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆంధ్రకేసరి యూనివర్సిటీ వైస్‌ చాన్సిలర్‌ ప్రొఫెసర్‌ డి.వి.ఆర్‌.మూర్తి, రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ బి.హరిబాబు సూచనల మేరకు ఏకేయూ సమావేశపు హాలులో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో తొలుత ఏకేయూ ప్రొఫెసర్లు, ఉద్యోగులంతా జగ్జీవన్‌రామ్‌ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఏకేయూ కంట్రోలర్‌ ఆఫ్‌ ఎగ్జామినేషన్స్‌ డాక్టర్‌ కేవీఎన్‌ రాజు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఆనాటి కాలంలో సమాజంలోని ప్రజలందరికీ సమానత్వం కోసం నిరంతరం జగ్జీవన్‌రామ్‌ శ్రమించడం జరిగిందన్నారు. సమకాలీన వ్యవస్థలో సమూలమైన మార్పుల కోసం, అణగారిన వర్గాల పట్ల వేళ్లూనుకుని ఉన్న వివక్షతను రూపుమాపేందుకు కృషిచేసిన మహనీయుడు జగ్జీవన్‌రామ్‌ అని కొనియాడారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏకేయూ కళాశాల ప్రిన్సిపాల్‌ ప్రొఫెసర్‌ రాజమోహన్‌రావు మాట్లాడుతూ చిన్నతనం నుంచే చురుకైన వ్యక్తిగా ప్రత్యేక గుర్తింపు పొందిన జగ్జీవన్‌రామ్‌.. 40 సంవత్సరాల సుదీర్ఘ కాలం రాజకీయాలు నిర్వహించిన ప్రజానేతగా పేరు ప్రఖ్యాతులు పొందినట్లు తెలిపారు. ఏకేయూ కళాశాల వైస్‌ ప్రిన్సిపాల్‌, ఆర్‌అండ్‌డీ కో ఆర్డినేటర్‌ ప్రొఫెసర్‌ ఎస్‌.నిర్మలామణి, సీడీసీ డీన్‌ ప్రొఫెసర్‌ సోమశేఖర్‌, ఎన్‌ఎస్‌ఎస్‌ విభాగం కో ఆర్డినేటర్‌ డాక్టర్‌ మండే హర్షప్రీతం దేవ్‌కుమార్‌, ఇంజినీరింగ్‌ విభాగం ఇన్‌చార్జి డాక్టర్‌ ఆర్‌.శ్రీనివాస్‌, ఎంఎస్‌డబ్ల్యూ విభాగం హెడ్‌ డాక్టర్‌ పిల్లి వెంకటరావు, ఆర్గానిక్‌ కెమిస్ట్రీ విభాగం అధ్యాపకుడు డాక్టర్‌ ఉబ్బా ఈతముక్కల, బోధన, బోధనేతర సిబ్బంది, స్కాలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే భూమి ఆరోగ్యం

చీమకుర్తి రూరల్‌: ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ప్రకారం వ్యవసాయం చేయడం వలన భూమి సారవంతంగా ఉండి అధిక దిగుబడి వస్తుందని మండల వ్యవసాయాధికారి డీవీ భాస్కర్‌ తెలిపారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీసీఎన్‌ఎఫ్‌ సిబ్బంది కాన్వర్జేషన్‌ మీటింగ్‌ నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ ప్రధాన పంటకు ముందు పచ్చిరొట్ట పైర్లు అయిన మినుము, జీలుగ, పెసర, జనుము వేసి పొలంలో కలియదున్నుకుంటే భూమి సారవంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం భాగ్యలక్ష్మి, సీసీలు ఎస్‌.శ్రీనివాసరావు, ఎం.బ్రహ్మయ్య, రాధ, సుధారాణి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయ పద్ధతులను వివరిస్తున్న ఏఓ భాస్కర్‌

వైఎస్సార్‌ సీపీ ప్రభల ఏర్పాటుకు సన్నాహాలు



వైఎస్సార్‌ సీపీ విద్యుత్‌ ప్రభ నిర్మాణానికి పూజలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్‌ బూచేపల్లి వెంకాయమ్మ, నాయకులు

చీమకుర్తి: రామతీర్థం తిరునాళ్లలో వైఎస్సార్‌ సీపీ తరఫున ఏర్పాటు చేయనున్న విద్యుత్‌ ప్రభకు శుక్రవారం సన్నాహక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. చీమకుర్తిలోని బూచేపల్లి కల్యాణ మండపం ప్రాంగణంలో వైఎస్సార్‌ సీపీ ప్రభ నిర్మాణానికి జెడ్పీ చైర్‌పర్సన్‌ బూచేపల్లి వెంకాయమ్మ పూజలు నిర్వహించారు. ఈ నెల 11వ తేదీ రామతీర్థంలో మందిరాలు, 12న రామతీర్థంలో గంగమ్మ తిరునాళ్లు జరగనున్నాయి. ఆయా కార్యక్రమాలలో భాగంగా వైఎస్సార్‌ సీపీ తరఫున నిర్మించనున్న ప్రభల కార్యక్రమాలలో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. వైఎస్సార్‌ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నం శ్రీధర్‌బాబు, పార్టీ పట్టణ అధ్యక్షుడు క్రిష్టిపాటి శేఖరరెడ్డి, రూరల్‌ మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు బీమన వెంకట్రావు, కంజుల ప్రతాప్‌రెడ్డి, గంగిరెడ్డి సుందరరామిరెడ్డి, పాదిలి కాశయ్య, బడే అయ్యపరెడ్డి, గోపురపు చంద్ర, సోమా శేషాద్రి, పత్తి కోటేశ్వరరావు, చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నిప్పట్లపాడులో రెండోవిడత రీసర్వే



రీ సర్వే గురించి రైతులకు వివరిస్తున్న మండల రెవెన్యూ అధికారి బ్రహ్మయ్య

చీమకుర్తి రూరల్‌: మండలంలోని నిప్పట్లపాడు సచివాలయం పరిధిలో రెండోవిడత రీసర్వే నిర్వహించేందుకు శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. మండల రెవెన్యూ అధికారి బ్రహ్మయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభలో రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం రైతులకు అవగాహన కోసం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

ఓటర్‌ కార్డుకు ఆధార్‌ అనుసంధానించాలి



బీఎల్వోలతో మాట్లాడుతున్న తహసీల్దార్‌ సుజన్‌ కుమార్‌

మద్దిపాడు: ఓటర్‌ కార్డుకు ఆధార్‌ నంబర్‌ను తప్పనిసరిగా అనుసంధానించాలని తహసీల్దార్‌ సుజన్‌ కుమార్‌ సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్‌ కార్యాలయంలో బీఎల్వోలకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు సలహాలు, సూచనలు చేశారు. ఓటర్‌ కార్డులో పేరు తప్పు ఉన్న వారికి సరిదిద్దాలని సూచించారు. నూతన ఓటర్ల నమోదు, తొలగింపు వంటి వాటిని ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలని చెప్పారు. ఒకే కుటుంబ సభ్యుల ఓట్లు ఒకే పోలింగ్‌ బూత్‌లో ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్‌ అజయ్‌కుమార్‌రెడ్డి, ఆర్‌ఐ రమణయ్య, బీఎల్వోలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



శక్తి యాప్‌ చూపిస్తున్న మహిళలతో సీఐ శ్రీకాంత్‌బాబు

నాగులుప్పలపాడు: సమాజంలోని ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఒంగోలు రూరల్‌ పోలీస్‌స్టేషన్‌ సీఐ శ్రీకాంత్‌బాబు సూచించారు. వృద్ధులు, మహిళలు, గ్రామస్తులకు శుక్రవారం నాగులుప్పలపాడులోని సచివాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరికైనా ఎలాంటి సమస్య ఉన్నా వెంటనే పోలీస్‌ స్టేషన్‌లోగానీ, డయల్‌ 100కుగానీ ఫోన్‌ చేసి చెప్పాలన్నారు. వృద్ధులు ఇబ్బందులు పడుతున్నట్లు ఎవరి దృష్టికి వచ్చినా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అదే విధంగా శక్తి యాప్‌ మీద మహిళలు, సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తిరుపతిరెడ్డి, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

నాగులుప్పలపాడు: ప్రజల దాహార్తి తీర్చేందుకు నాగులుప్పలపాడు పోలీస్‌ స్టేషన్‌ వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని గ్రామస్తులు ఏర్పాటు చేయగా, శుక్రవారం ఎస్సై శ్రీకాంత్‌ ప్రారంభించారు. పోలీస్‌ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై శ్రీకాంత్‌